క్లుప్తంగా

రైతు బజార్‌లో రూ.50కే టమాటా విక్రయాలు



కంచికచర్ల: బహిరంగ మార్కెట్‌లో టమాటా ధరలు ఆకాశాన్ని అంటడంతో ప్రజలకు ప్రభుత్వం రాయితీపై అందజేస్తోంది. బయట మార్కెట్‌లో టమాటా ధర కేజీ రూ.100 ఉండగా ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా ప్రజలకు రాయితీపై రూ.50కే ఇస్తోంది. స్థానిక రైతు బజార్‌లో శనివారం రాయితీపై ఇస్తున్న టమాటా కోసం ప్రజలు బారులు తీరారు.

వైష్ణవ ఆలయాల్లో గోదా మాత తిరునక్షత్ర పూజలు



జగ్గయ్యపేట అర్బన్: ఆండాలమ్మ వారి తిరునక్షత్రం సందర్భంగా శనివారం పట్టణంలోని పలు వైష్ణవ ఆలయాలలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురాతన దేవాలయం అయిన శ్రీభూ గోదా సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష అర్చనలు చేసి అనంతరం ప్రత్యేక పీఠంపై గోదా మాతను ఉంచి పాలు, తేనె వివిధ సుగంధ ద్రవ్యాలతో అర్చకులు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా గోదా మాత ఉత్సవమూర్తికి అభిషేకాలు నిర్వహించారు. పాలేటి తీరంలో ఉన్న శ్రీరంగనాయక స్వామి వారి ఆలయం, ప్రాచీన పాత వెంకటేశ్వరస్వామి ఆలయం, శేషాచల వెంకటేశ్వరస్వామి వారి ఆలయాలలో గోదా మాత అభిషేకాలను, విశేష పూజలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

విద్యపైనే దేశ భవిష్యత్తు ఆధారం



సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): విద్యపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యా రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు సెమిస్టర్-2 ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లిషు మీడియం, సీబీఎస్ఈ వంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.జ్యోతి, ఉపసర్పంచ్ మోరంపుల పూర్ణయ్య, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ బెజవాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనిగండ్లపాడు గ్రామంలో జరిగిన పుస్తకాల పంపిణీలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు



కొణకంచి,నవాబుపేట(పెనుగంచిప్రోలు): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్తగా ఓటు హక్కు నమోదు చేస్తామని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఎస్ఎస్ఏ కో–ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. ఓటుకు సంబంధించి జరుగుతున్న ఇంటింటి సర్వేలో భాగంగా శనివారం కొణకంచిలో మహేశ్వరరావు, నవాబుపేటలో శ్రీనివాసరావు పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓటరు సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కొత్త ఓటు నమోదు చేసుకునేందుకు ఆగస్టు 21 వరకు సమయం ఉందన్నారు. ఆయా గ్రామాల్లో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఆ ఇంట్లోని ఓటర్ల వివరాలను జాబితాలో సరి చూస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, డీటీ భాస్కర్, ఏఓ సిద్ధారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ జనార్ధనరావు, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అత్యంత చేరువగా ప్రభుత్వం

- నందిగామ రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా పండుగలా జగనన్న సురక్ష క్యాంపులు
- దరఖాస్తుదారులకు ఉచితంగా వేలాది సర్టిఫికెట్‌లు పంపిణీ



జమ్మవరంలో సర్టిఫికెట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కొణకంచిలో వలంటీర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పొన్నవరం, జమ్మవరం గ్రామ సచివాలయాలలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఆదాయ, కుల, జనన, మరణ, తదితర 11 రకాల సర్టిఫికెట్‌లను సైతం ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉండీ ప్రభుత్వ పథకాలు పొందని వారిని గుర్తించి మంచి చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్‌లు షోడగిరి రాజశ్రీ, శీలం సంధ్య, మల్లెల అనూష, ఎంపీటీసీ సభ్యులు శీలం రమణారెడ్డి, యాదాల సుజాత, తహసీల్దార్ ఆశయ్య నాయక్, ఎంపీడీవో అరుంధతీ దేవి, పలువురు నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సులభతరంగా ప్రభుత్వ సేవలు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): జగనన్న సురక్షతో ప్రభుత్వ సేవలు లబ్ధిదారులకు మరింత సులభతరమయ్యాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. గ్రామంలోని సచివాలయం–1 పరిధిలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా 11 రకాల సర్టిఫికెట్‌లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ నాగరాజు, సొసైటీ చైర్మన్ చలమల శ్రీనివాసరావు, గ్రామ పార్టీ కన్వీనర్ జొన్నాబొట్ల సతీష్‌శర్మ, కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు దర్శినాల కమలేష్, నాగరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు. వేదాద్రి గ్రామంలో జగనన్న సురక్ష క్యాంపును తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడారు పేరయ్య, నాయకులు ఆనంగి శ్రీనివాసరావు, మువ్వా రాము, స్వామి, వైకుంతరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజారంజకంగా ప్రభుత్వ పాలన

కొణకంచి(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రజారంజకంగా సాగుతోందని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. గ్రామంలో శనివారం సర్పంచ్ గోనెల దేవి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు అందేవన్నారు. నేడు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి జి.మహేశ్వరరావు మాట్లాడుతూ వలంటీర్లు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నా వారిపై కొందరు అపోహలు, ఆరోపణలు సృష్టిస్తున్నారన్నారు. అనంతరం దరఖాస్తు చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సచివాలయ పరిధిలో నాలుగేళ్లలో సుమారుగా రూ.25 కోట్లు ప్రజలకు వివిధ రకాల పథకాలు అందించటంలో సేవ చేసిన వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరెడ్డి, వైద్యాధికారి కె.వాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, సచివాలయాల మండల కన్వీనర్ కె.శామ్యూల్, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, మండల ట్రేడ్ యూనియన్ నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి బి.ఏడుకొండలు పాల్గొన్నారు.

పండుగలా జరుగుతున్న జగనన్న సురక్ష

నందిగామ: జగనన్న సురక్ష కార్యక్రమాలు నియోజకవర్గ వ్యాప్తంగా పండుగలా జరుగుతున్నాయి. నందిగామ పట్టణంతో పాటు మండలంలో శనివారం జరిగిన కార్యక్రమాల్లో వేలాదిమందికి సర్టిఫికెట్లను అందజేశారు. పట్టణంలోని తొమ్మిదవ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 3,492 సర్టిఫికెట్లను అందజేశారు. మండలంలోని పెద్దవరం సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 5,318 సర్టిఫికెట్లను అందజేశారు. ఈ నేపథ్యంలో ఆయా కార్యక్రమాలు జరిగే ప్రాంతంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి వాతావరణం కనిపించింది. ప్రజలు సర్టిఫికెట్లను తీసుకునేందుకు బారులు తీరి కనిపించారు.



వేములపల్లిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ ప్రశాంతి, సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణ

సురక్ష క్యాంపులు నిరుపేదలకు వరం

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష క్యాంపులు నిరుపేద ప్రజలకు వరమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పెద్దవరం గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష క్యాంపుల వల్ల ప్రభుత్వ సేవలు ప్రజలకు ఉచితంగా అందుతున్నాయన్నారు. ముఖ్యంగా రోజుల తరబడి సమయం పట్టే సర్టిఫికెట్‌లు సైతం గంటల వ్యవధిలో లబ్ధిదారులకు అందిస్తున్నారని తెలిపారు. ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. ముందుగా గ్రామంలో ఉన్న అంకమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.



షేర్‌మహ్మద్‌పేటలో సర్టిఫికెట్‌లు పంపిణీ చేస్తున్న సామినేని వెంకటకృష్ణ ప్రసాద్



నందిగామ పట్టణంలో వివిధ సర్టిఫికెట్లు తీసుకోవడానికి బారులు తీరిన ప్రజలు



పెద్దవరం సురక్ష క్యాంపులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జగనన్న సురక్షతో అర్హులందరికీ న్యాయం

జగనన్న సురక్ష శిబిరాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా వారికి అవసరమైన సేవలు ప్రభుత్వం నుంచి అందుతున్నాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ అన్నారు. మండలంలోని వేములపల్లి గ్రామంలో శనివారం జగనన్న సురక్ష గ్రామసభ సర్పంచి ఉయ్యూరు అనుమాయమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుకునే విషయంలో ఎవరూ మిగిలిపోకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం 2,058 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎల్‌పీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ శంకరబాబు, ఎంపీడీఓ బాలశంకరరావు, డీటీ నాగుల్ మీరా, వీఆర్వో రామారావు, పంచాయతీ కార్యదర్శి వనిత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధి ఎమ్మెల్యే ఘనతే

ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామటౌన్: గత ప్రభుత్వాల హయాంలో కాలనీలు అన్నా కాలనీలలో నివసించే ప్రజలన్నా చులకన భావం ఉండేదని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలనీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి కాలనీ వాసులకు ఆత్మగౌరవాన్ని అందించారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. పట్టణంలోని 17,18 వార్డుల పరిధిలోని తొమ్మిదవ సచివాలయంలో అధికారులు నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో డీవీఆర్ కాలనీని అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుకే దక్కిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు అధికంగా నివసించే 17,18 వార్డులలో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించామని తెలిపారు.

ఈ రెండు వార్డుల పరిధిలోని ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.10 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని, రూ.2.20 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు అరుణకుమార్ తెలిపారు. అర్బన్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశామని, త్వరలోనే కాలనీకి సమీపంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం కూడా చేపడుతున్నట్లు చెప్పారు. ఇక్కడి ప్రజలు శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, త్వరలో శ్మశానానికి స్థలం కేటాయించనున్నట్లు చెప్పారు. అనంతరం 3,574 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు.



నందిగామ తొమ్మిదవ సచివాలయంలో సర్టిఫికెట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా పాలన

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: మండలంలోని వీరులపాడు గ్రామంలో శనివారం ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ కుల, వర్గ, మత భేదాలు లేని సమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సమాజంలో అన్ని వర్గాలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు నిరంతరం మంచి చేయాలనే తపనతో పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి పూర్తి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు మందూరి గోపి, శీలం లక్ష్మీప్రసన్న, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



వీరులపాడు గ్రామంలో గడపగడపలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

గృహాల మధ్య ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉంచాలి



జగ్గయ్యపేటఅర్బన్: జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను ఆయా స్థలాల యజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. స్థానిక ఆరవ వార్డు పరిధిలో బిలాల్ మసీదు సమీపంలో గృహాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి ఉండటంతో ఆ స్థలాల్లో విష సర్పాలు, క్రిమి కీటకాలు సంచరిస్తున్నాయని స్థానికులు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన ఖాళీ స్థలాలను శుభ్రం చేయాల్సిందిగా జేసీబీని పంపించారు. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కంపచెట్ల తొలగింపు పనులను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారికి నోటీసులు పంపిస్తామని తెలిపారు. వారి స్థలాలను వారే బాగుచేసుకుని ఫెన్సింగ్ వేసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పెనుగంచిప్రోలు సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్ పాల్గొన్నారు.

అపజయాలు విజయ సోపానాలు కావాలి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: జీవితంలో అపజయాలు విజయ సోపానాలు కావాలే కాని మెడకు బిగిసే ఉరితాడు కాకూడదని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. స్పందన ఈదా ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్, ముస్లిం చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీకరం కల్యాణ మండపంలో ఆత్మహత్యలపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదని ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. చిన్నచిన్న కారణాలకు బంగారు భవిష్యత్తు ఉన్న జీవితాన్ని అర్థాంతరంగా ముగించాలనుకోవటం మంచి పద్ధతి కాదని తెలిపారు. మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండాలని సూచించారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించిన స్పందన ఈదా ఫౌండేషన్ చైర్మన్ శామ్యూల్‌రెడ్డి, ముస్లిం చైతన్య వేదిక అధ్యక్షుడు దుబాయ్ కరిముల్లాలను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఏసీపీ జనార్ధన్ నాయుడు, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.



ఆత్మహత్యల నివారణ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఘనంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు జన్మదిన వేడుకలు

నందిగామటౌన్/వీరులపాడు/కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు జన్మదిన వేడుకలు పలు సంస్థలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నందిగామ పట్టణంలో స్పందన ఈదా ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్, ముస్లిం చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీకరం కల్యాణ మండపంలో ఒక కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు జన్మదిన కేక్‌ను ఎమ్మెల్సీ అరుణ కుమార్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిదవ నంబరు సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకును ఎమ్మెల్సీ అరుణకుమార్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, కౌన్సిలర్లు బాపట్ల సాంబయ్య, బండారు గంగమ్మ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు. వీరులపాడులో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు జన్మదినం సందర్భంగా ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు తదితరులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరులపాడు మండలంలోని జుజ్జూరులో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, షేక్ ఫయాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్ బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి ఎమ్మెల్యే జగన్‌మోహనరావు జన్మదిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, వైస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వేముల గోపి, గుగులోతు శివనాయక్ విద్యార్థులకు నోటు పుస్తకాలను వేమా సురేష్‌బాబు చేతులమీదుగా పంపిణీ చేశారు.



కంచికచర్లలో మహిళా మార్ట్ వద్ద ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

చేయూత మహిళా మార్ట్ వద్ద...

స్థానిక వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ వద్ద మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, మహిళా మార్ట్ అధ్యక్షురాలు ముత్యాల రోజా రమణి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

మొదటి భార్య రీల్స్ చూస్తున్నాడని...

భర్త మర్మాంగాలపై రెండవ భార్య దాడి

నందిగామ: మొదటి భార్య చేస్తున్న వీడియో రీల్స్ చూస్తున్నాడన్న కోపంతో రెండవ భార్య భర్త మర్మాంగాలపై దాడి చేసిన ఘటన నందిగామలో జరిగింది. ఏసీపీ జనార్ధన్ నాయుడు తెలిపిన సమాచారం ప్రకారం చందర్లపాడు మండలం ముప్పాళ్ళ గ్రామానికి చెందిన ఆనందరావు మొదటి భార్యతో విడిపోయి, నాలుగేళ్ల క్రితం రెండవ వివాహం చేసుకున్నాడు. గత కొన్నాళ్లుగా పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్ లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఆనందరావు తన మొదటి భార్య చేసిన వీడియో రీల్స్ చూస్తున్నాడు. అది చూసి ఆగ్రహంతో రెండవ భార్య భర్తతో వివాదానికి దిగి అతని మర్మాంగాలపై దాడి చేసింది. ఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటిన కచేరీలు



విజయవాడకల్చరల్: స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ షష్టి పూర్తి సందర్భంగా లబ్బీపేట శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శాస్త్రీయ సంగీత ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శనివారం నాటి కార్యక్రమాలు ఎస్వీ ఆదిసుందరి గాత్ర కచేరీతో ప్రారంభమయ్యాయి. ఆర్.రాజేశ్వరి, ఆర్‌హెచ్‌పీ వరలక్ష్మి, బీవీఎస్ఎస్ కృష్ణ, పొన్నపల్లి రమాభగవాన్, పద్మశ్రీ తదితరులు పలు సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

నేడు సుధాకర్‌కు స్వర్ణకంకణ ప్రదానం

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, విద్యాపరిషత్ డాక్టర్ పేరాల బాలమురళీ కృష్ణ సంగీత విద్వాంసుల సమక్షంలో రాత్రి 7 గంటలకు స్వర్ణకంకణ సత్కారం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకుడు వేమూరి విశ్వనాథ్ చెప్పారు.

అట్టహాసంగా నృత్య నీరాజనం ప్రారంభం

విజయవాడకల్చరల్: శ్రీ వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే నృత్య నీరాజనం 2023 కార్యక్రమాలు వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాట్యాచార్యులు సప్త శివకుమార్, మాగలూరి త్రినాథాచారి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. వాగ్గేయకార కీర్తనలకు కూచిపూడి, భరతనాట్యం, సంప్రదాయంలో నృత్యాలను అభినయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పరీక్షల విభాగం కమిషనర్ డి.దేవానందరెడ్డి మాట్లాడుతూ.. సంప్రదాయ నృత్యాలకు కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. భారతీయ నృత్య సంప్రదాయాలు దేశ కీర్తి ప్రతిష్టలను చాటుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఓఎస్‌డీ చీఫ్ విప్ డాక్టర్ ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ.. యువతలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్, గాయకుడు కుమార సూర్యనారాయణ పాల్గొన్నారు